క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ధర్నా

భీమవరం: రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం 45 రోజుల పాలనలోని వైఫల్యాలు, నరహంతక రాక్షస పాలన, ప్రజా ఉపయోగమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దును నిరసిస్తూ శుక్రవారం భీమవరంలో నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి రాయప్రోలు శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని ప్రకాశంచౌక్ సెంటర్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే ధర్నా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు.

బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమం మరచిన కేంద్రం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

భీమవరం: కేంద్ర బడ్జెట్‌లో అంకెల గారడి తప్ప కార్మికుల సంక్షేమం శూన్యమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. భీమవరం ప్యాడి అండ్ రైస్ మర్చంట్ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త పరిశ్రమలు నిర్మాణం వాటికి కేటాయించాల్సిన నిధులు కేటాయింపు తగిన విధంగా జరగలేదని మండిపడ్డారు. రాజధాని అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి బాధ్యత తమదేనని కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ నిధులు కేటాయింపు ఆ మేరకు జరగలేదని నర్సింహరావు విమర్శించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, బి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలని వినతి

భీమవరం అర్బన్: మూడు నెలలు క్రితం చేసిన ఉపాధి హామీ పనులు తాలుకూ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని కరుకువాడ బేతపూడి సచివాలయంలో గురువారం వెల్ఫేర్ అసిస్టెంట్ మహేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బుంగా జాన్, మందా పెద బుజ్జి, బుంగా లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాక్ బృందం పర్యటన

భీమవరం: భీమవరం టుటౌన్‌లోని ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) బృందం సందర్శించింది. ఆర్‌ఆర్‌డీఎస్ కళాశాలలో గత ఐదేళ్ల ప్రగతిని మదింపు చేసి గ్రేడ్ ప్రకటిస్తారని ఆర్‌ఆర్‌డీఎస్ కళాశాల ప్రిన్సిపల్ వీకేజే ప్రసూన విలేకరులకు చెప్పారు.

ఘనంగా కార్గిల్ విజయ దివస్ ర్యాలీ

భీమవరం: కార్గిల్ విజయం భారతదేశ చరిత్రలో సువర్ణ అధ్యాయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. కార్గిల్ విజయ దివస్ కాగడాల ర్యాలీని గురువారం బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా తొమ్మిది మంది కార్గిల్ సైనికుల సత్కరించారు. తహసీల్దార్ ఆఫీస్ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద నుంచి బొంబే స్వీట్స్ దగ్గర ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పేరిచర్ల సుభాష్, కోమటి రవికుమార్, కాగిత సురేంద్ర, వబిలిశెట్టి రామకృష్ణ, ఆకుల లీలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

పాలకోడేరు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా కుముదవల్లి గ్రామంలోమొక్కలు నాటామని విష్ణు కాలేజీ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు అన్నారు. బుధవారం డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ, విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మాకే నామ్ అనే మెగా క్యాంపెయిన్‌ను నిర్వహించారు. ఈ పథకం గురించి వేణు మాట్లాడుతూ తల్లిపేరు మీద గ్రామంలోని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బీహెచ్ వంశీకృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎం శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీని గురువారం లెక్కించారు. సుమారు 36 రోజుల కాలానికి గానూ రూ.6,91,761లు ఆదాయం లభించినట్లు ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు.

ఎర్ర నీరు.. రైతు కంట కన్నీరు



అజ్జమూరు గ్రామంలో కుళ్లిన నారుమడిని చూపిస్తున్న రైతులు



కుప్పనపూడి గ్రామంలో కుళ్లిన నారుమడి వద్ద రైతు



నీట మునగడంతో కుళ్లిపోయిన నారుమడి

- రైతులను నిండా ముంచిన ఎర్రకాలువ
- ఎర్ర కాలువ పోటెత్తడంతో కుళ్లిపోయిన 247 హెక్టార్ల నారుమడి

ఆకివీడు: ఖరీఫ్ రైతు కంట ఎర్రకాలువ ఎర్ర నీరు కన్నీరు పెట్టించింది. వాతావరణం అనుకూలించి ఖరీఫ్ పంట సజావుగా సాగిపోతుందని ఆనంద పడ్డ రైతాంగానికి ఆకుమడుల దశలోనే కోలుకోలేని దెబ్బ తగిలింది. రైతులను ఆర్థికంగా, మానసికంగా వాతావరణం దెబ్బతీసింది. నారుమడులు వేసేందుకు సకాలంలో పంట కాల్వల నీరు అందకపోవడంతో రైతాంగం వరుణుడిపైనే ఆధారపడ్డారు. జూన్ నెలాఖరులో చెదురు మదురు వర్షాలు కురవడంతో చాలా మంది రైతులు నారుమడులు వేసుకున్నారు. అయితే నారు ఎదుగుతున్న దశలో వాయుగుండం ప్రభావానికి నారుమడులు దెబ్బతిన్నాయి. వరద ముంపునీటినుండి నారుమడులను రక్షించుకునే ప్రయత్నంలో రైతాంగం ఉండగా ఒక్కసారిగా ఎర్రకాలువ నీరు ఉధృతంగా ప్రవహించడంతో అన్ని ప్రాంతాల్లోని పంట కాలువలు, మురుగు కాలువలకు నీరు వదిలివేశారు. దీంతో ఉండి నియోజకవర్గంలోని పల్లపు, మెట్ట ప్రాంతాల్లోని ఆకుమడులు, నాట్లు వేసిన పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. నియోజకవర్గంలో సుమారు 22 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు 641 హెక్టార్లలో నారుమడులు వేశారు. జూలై మొదటి వారం నాటికే సుమారు 1200 హెక్టార్లలో నాట్లు వేశారు. భారీ వర్షాలు, వరదలు, ఎర్రకాల్వ ఉధృతి నీరు ముంచెత్తింది. లోతట్టు, మెట్ట ప్రాంతాల్లోని ఆకుమడులు నీట మునిగాయి. ప్రస్తుతానికి ఆయా గ్రామాల్లో సుమారు 247 హెక్టార్లలో ఆకుమడులు నీట మునిగి కుళ్లిపోతున్నాయి. 821 హెక్టార్లలో నాట్లు కుళ్లిపోతున్నాయి. దీంతో వేలాది ఎకరాల సాగుకు ఆకు దొరకడం కష్టతరమని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సాగు చేయాలా? లేక క్రాప్ హాలిడే ప్రకటించాలా అనే సందిగ్ధంలో కొంత మంది రైతులున్నారు.

రబీ వంగడాలే శరణ్యం

ప్రస్తుత పరిస్థితుల్లో ఖరీఫ్ సాగుకు తక్కువ రోజుల్లో పంట వచ్చే రబీ వంగడాల్ని సాగు చేయడమే శ్రేయస్కరమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఎంటీయూ 1153, 1156 రకం వంగడాలను సాగు చేయడం ద్వారా క్రాప్ హాలిడేకి చెక్ పెట్టవచ్చునని చెబుతున్నారు. వరద నీరు బయటకు పోయిన వెంటనే నారుమడులు వేసి, ఖరీఫ్‌సాగుకు సన్నద్ధం కావాలని సూచిస్తున్నారు. రైతాంగానికి సబ్సిడీపై వరి విత్తనాల్ని సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

మండలం	నారుమడి (హెక్టార్లు)	నష్టపోయిన నారు (హెక్టార్లు)	నాట్లు (హెక్టార్లు)
ఆకివీడు	81	22	104
పాలకోడేరు	260	80	---
కాళ్ల	81	30	33
ఉండి	219	115	684
మొత్తం	641	247	821

అప్పు చేసి నారుమడులు వేశాం



అప్పుచేసి నారుమడులు వేశాం. దమ్ము పనులకు సిద్ధమవుతున్న తరుణంలో భారీ వర్షాలు, వరదలతో మెట్ట ప్రాంతంలోని నారు మడులు కూడా కుళ్లిపోయాయి. అలాగే కొత్త ప్రభుత్వం రైతు భరోసా సొమ్ము ఇవ్వకపోవడంతో పెట్టుబడుల కోసం అప్పులోళ్ల దగ్గరకు తిరగాల్సి వస్తుంది. త్వరితగతిని ఆదుకుని, సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తే ఖరీఫ్ సాగు చేయగలం.

– నంద్యాల రామకృష్ణ, కౌలు రైతు, అజ్జమూరు

సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత కళాకారులదే



భీమవరంలో ప్రజానాట్యమండలి శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న శర్మ

భీమవరం: ప్రజల్లో మతం పేరుతో విభేధాలు సృష్టిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రజా సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రజా కళాకారులపై ఉన్నదని మాజీ ఎమ్మెల్సీ ఎంఈఎస్ శర్మ అన్నారు. భీమవరంలో నిర్వహిస్తున్న ప్రజానాట్యమండలి శిక్షణ తరగతుల్లో గురువారం శర్మ సాంస్కృతిక రంగంలో కర్తవ్యాలు అనే అంశంపై మాట్లాడారు. ప్రజల్లో ఐక్యత చేకూర్చడమే ప్రజా కళాకారుడి కర్తవ్యమని దీనికిగాను సంఘ సంస్కర్తలు చేసిన కృషిని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అ.నిల్‌కుమార్ మాట్లాడుతూ కళలు కాసులు కోసం అమ్ముడు అవుతున్న ఈ రోజుల్లో ప్రజల కోసం ప్రజల కష్టాలను ప్రజల బాధలను కళారూపాలలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో చైతన్యం తీసుకురావడానికి ప్రజానాట్యమండలి కృషి చేస్తుందన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.రమణ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన శిక్షణ తరగతుల్లో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.మంగరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.చైతన్య ప్రసాద్, షేక్ వలి, ఎస్.రంగ, బురిడీ శ్రీరాములు, భార్గవ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎఫ్ కాంట్రాక్ట్ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

భీమవరం: చట్ట విరుద్ధంగా పరిశ్రమలకు లాక్‌వుట్ ప్రకటించి కార్మికులకు తగిన నష్టపరిహారం కూడా ఇవ్వకుండా రోడ్డున పడేస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎన్‌వీ గోపాలన్, కె.రాజా రామ్మోహన్‌రాయ్ ఆందోళన వ్యక్తం చేశారు. గణపవరం మండలం సరిపల్లిలోని థాయ్‌లాండ్‌కు చెందిన సీపీఎఫ్ కాంట్రాక్ట్ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని గురువారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్, రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా యాజమాన్యం ఏకపక్షంగా ఆకస్మికంగా పరిశ్రమను మూసేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఇ.ప్రకాష్, ధర్మ, కె.శ్రీను, కత్తుల పెద్దిరాజు, సీహెచ్ జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పరిరక్షణకు సర్వే పూర్తి చేయాలి



ఉండిలో నిర్వహించిన సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీంద్ర

ఉండి: పారిశుధ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాలకు ముందుగా చేపట్టాల్సిన సర్వే పనులు అధికారులంతా త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్.రవీంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ అన్ని శాఖల అధికారులతో సర్వేపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలు బహిరంగ మలవిసర్జన (ఓడీఎఫ్) లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. దీనికోసం అధికారులు ఇంటింటి సర్వే చేసి ప్రభుత్వం నిర్దేశించిన అన్ని అంశాలతో సర్వే పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మురుగుకాలువల్లో పూడిక తొలగించాలని ధర్నా



తాడేరు వంతెన వద్ద ధర్నా చేస్తున్న రైతు కార్యాచరణ సమితి, కౌలురైతుల సంఘం నాయకులు

భీమవరం: గునుపూడి, తాడేరు మురుగు కాలువల్లోని గుర్రపుడెక్క, తూడు తక్షణం తొలగించి ముంపు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా రైతు కార్యచరణ సమితి, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో గురువారం తాడేరు వంతెన వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కార్యచరణ సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీరామరాజు, కౌలురైతులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ గునుపూడి డ్రెయిన్‌పై అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. వర్షాలకు గత పదిహేను రోజులుగా నారుమళ్లు మునకలో ఉన్నా కాలువలో చెత్త తీయకుండా కలుపు మందు కొట్టి వదిలేయడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. కార్యక్రమంలో రైతు కార్యచరణ సమితి గౌరవధ్యక్షుడు కలిదిండి గోపాలకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి తమ్మినీడి నాగేశ్వరరావు, మంతెన కృష్ణంరాజు, నల్లం నాగేశ్వరరావు, నందమూరి కృష్ణ, వంగా పుల్లారావు, గందం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఆకివీడు: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగి నాలుగు కాసుల ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని పిన్నమరాజు సూరపరాజు, స్వప్నలు వైద్యం నిమిత్తం భీమవరంలోని ఆసుపత్రికి ఈ నెల 22న ఇంటికి తాళం వేసి వెళ్లారు. గురువారం ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని గమనించిన స్థానికులు సూరపరాజుకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే వచ్చి చూసేసరికి ఇంటి తాళంతో పాటు బీరువా తెరిచి ఉండడాన్ని గమనించారు. అనంతరం నాలుగు కాసుల బంగారు ఆభరణాలు చోరీకు గురి అయ్యాయని గుర్తించడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఎస్సై బి.నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

తాళ్లకోడు కాలనీని ఆకివీడులో విలీనం చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, బాధితులు

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడు పేదల 74 ఎకరాల కాలనీ ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోనిదేనని, ఆ విధంగా నగర పంచాతీలో విలీనం చేయాలని కోరుతూ బాధితులు, సీపీఎం నాయకులు గురువారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పట్టణ పౌరుల సంఘం నాయకులు బీవీ వర్మ మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే సమయంలో లబ్ధిదారులు నగర పంచాయతీ పరిధిలోని వారు కావడం వల్లే ఒక్క సెంటు చొప్పున ఇచ్చారన్నారు. ఈ ప్రాంతం నగర పంచాతీకి చెందినదని అప్పట్లో ప్రకటించి నగర పంచాయతీ ఆధ్వర్యంలో పలు పనులు చేయించారని చెప్పారు. కాలనీ ప్రాంతం కుప్పనపూడి, నగర పంచాయతీకి కాకుండా పోయారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డోకల రవితేజ, బీ.రాంబాబు,సందక సూరిబాబు, గేదల ధనుష్, పిసిని వరలక్ష్మి, ఇజ్జాడ రమణ, నీలం నాయుడు అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

వీరవాసరం: పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని గురువారం యూటీఎఫ్ నాయకులు ఎంఈవోకి వినతిపత్రం అందజేశారు. జీఓ 117 రద్దు చేసి జీవో నం.55 ప్రకారం ఉపాధ్యాయులను కొనసాగించాలని కోరారు. 20 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవోకి అందజేశారు. కార్యక్రమంలో జీవీ రమణ, ఎం.శ్రీనివాసరావు, డి.పుల్లారావు, కె.నాగమునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యండగండిలో తహసీల్దార్ పర్యటన



యండగండిలో పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఉండి: భారీవర్షాలకు ముంపు సమస్యలతో అతలాకుతలమైన యండగండి గ్రామంలో గురువారం తహసీల్దార్ కె.శ్రీనివాస్ పర్యటించారు. గ్రామంలోని తిమ్మరాజు కాలనీ, పంచాయతీ ఏరియా, కనకదుర్గమ్మ గుడి ఏరియా గ్రామంలోని తదితర ప్రాంతాల్లో 49 ఇళ్లు నీట మునిగినట్లు గుర్తించామని తహసీల్దార్ తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని, యండగండిలో ఉండి కాలువ అండర్ టన్నెల్ వద్ద చెత్తా చెదారం తొలగించడంతో గ్రామంలోని, వరిచేలల్లోని మురుగునీరు బయటకు వెళ్లేందుకు మార్గం సుగమమైందని రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కార్తీక్, వీఆర్వో గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మరింత పెరిగిన గోదావరి నీటిమట్టం



వలంధర్‌రేవులో పిండ ప్రదానం షెడ్డు సగం వరకు చేరిన గోదావరి

నరసాపురం: నరసాపురంలో వశిష్ట గోదావరి ఉగ్రరూపంలో ప్రవహిస్తోంది. దీంతో గోదావరి పరివాహక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భద్రాచలంలో నీటమట్టం తగ్గుతూ ఉండటంతో ఎగువ ప్రాంతాల నుంచి వశిష్ట గోదావరిలోకి నీరు భారీగా వచ్చి చేరుతుంది. భారీగా వస్తున్న నీరు సముద్రంలో కలుస్తుంది. అయితే సముద్రం పోటు సమయంలో నీరు నిలిచిపోవడంతో స్థానికంగా నీటిమట్టం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి సముద్రంలో కలవడానికి నీరు వస్తూ ఉన్నంత వరకూ స్థానికంగా నీటిమట్టం పెరుగుతూనే ఉంటుంది. వలంధర్‌రేవులో స్నానాలరేవు వద్ద ప్రమాదకర స్థితిలో నీటి ప్రవాహం ఉంది. పిండప్రదానం షెడ్డు పూర్తిగా మునిగిపోయింది. మాధవాయిపాలెం రేవులో పంటు రాకపోకలు గురువారం కూడా కొనసాగించలేదు. ఎగువ ప్రాంతాల్లో వరద తీవ్రత తగ్గినా మరో రెండు మూడు రోజులు నరసాపురంలో గోదావరి ఉధృతి ఇలాగే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సిద్ధాంతంలో నిలకడగా గోదావరి

పెనుగొండ: వశిష్ట గోదావరి ఉధృతి తగ్గు ముఖం పట్టింది. ఎగువ నుంచి వరద నీరు జోరు తగ్గడంతో నెమ్మదిగా గోదావరి మాత శాంతిస్తుంది. సిద్ధాంతంలో రెండు అడుగుల నీటి మట్టం దక్కింది. కేదారీఘాట్‌లోని పుష్కర రేవులు గోదావరి నీటి ముంపు నుంచి బయట పడ్డాయి. తగ్గుముఖం పట్టడంతో పరిసర ప్రాంతాలకు చెందిన వారు గోదావరి మాతకు పసుపు కుంకుమలు సమర్పించి పూజలు నిర్వహిస్తున్నారు. నీటి మట్టం తగ్గుతుండడంతో అధికారులు, రైతుల ఊపిరి పీల్చుకొన్నారు. మధ్యస్థ లంకలోకి రాకపోకలు యథావిధిగా కొనసాగిస్తున్నారు.

రాధాకృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు

భీమవరం: అధికారుల వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న కాకినాడ మెడికల్‌శాఖ సీనియర్ అసిస్టెంట్ కాండ్రేగుల రాధాకృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని గురువారం జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణికి ఏపీ జేఏసీ, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా చైర్మన్ చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ రాధాకృష్ణ మృతికి కారణమైన అధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్జీవోస్ అసోసియేషన్ కార్యదర్శి నెరుసు రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెనుమరెడ్డి శ్రీనివాస్, మెడికల్ శాఖ మినిస్టీరియల్ సంఘ నాయకుడు చీకట్ల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు ఆషాఢ మాస సారె సమర్పణ



వాసవీ మాతకు ఆషాఢ మాస సారె తీసుకువెళ్లుతున్న భక్తులు

ఆకివీడు: కుటుంబం, గ్రామం, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని కోరుతూ వాసవీ మాతకు గురువారం భక్తులు ఆషాఢ మాస సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన వంటకాలు, స్వీట్లు, పండ్లు, చీర, జాకెట్, పసుపు కుంకుమ, గాజులు సమర్పించారు.

ఉపాధి హామీ పథకంలో కచ్చా డ్రెయిన్ల తవ్వకం



చినకాపవరంలో కచ్చా డ్రెయిన్ తవ్వుతున్న దృశ్యం

ఆకివీడు: ఉపాధి హామీ కూలీలతో కచ్చా డ్రెయిన్లు తవ్వించడం ద్వారా ఆయా గ్రామాల్లోని వర్షపు ముంపు నీటిని బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్యదర్శి పి.ఆనంద భూషణం చెప్పారు. మండలంలోని చినకాపవరం, దుంపగడప గ్రామాల్లో గురువారం వర్షపు ముంపునీటిని తొలగించే చర్యలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామల కార్యదర్శి ఆనంద భూషణం మాట్లాడుతూ వర్షం నీటితో గుంతలు పడి రోడ్లు మునిగిపోతున్నాయన్నారు. వాటిని తొలగించి, రోడ్ల వెంబడి బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు చెప్పారు. అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టామని వివరించారు.

ఈ–మిషన్ శక్తిపై అవగాహన

పాలకోడేరు: ఈ–మిషన్ శక్తి వందరోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం విస్సాకోడేరు అంగన్‌వాడీ కేంద్ర వద్ద మహిళలకు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి ఆధ్వర్యంలో గురువారం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె బాలికలకు, మహిళా చట్టాలు, బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి అవగాహన కల్పించారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ

భీమవరం: పట్టణంలోని మెంటేవారితోట ప్రాంతం వర్షాలు, వరదలకు ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పారిశ్రామిక వేత్త గాదిరాజు సుబ్బరాజు అన్నారు. మెంటే వారితోటలో ముంపునకు గురై ఇబ్బందులు పడుతున్న బాధితులకు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురువారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సుబ్బరాజు ఆర్థిక సహకారంతో ముంపు బాధితులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఎద్దు ఏసుపాదం, మెంటే గోపి, లోవరాజు, రాంబాబు, తోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.55 వేల విరాళం

భీమవరం: పట్టణంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం పథకానికి ఆకివీడుకు చెందిన ఎస్.తేజ., ధరణి దంపతులు వారి కుమారుడు ఎస్.మురారి విశాల్ పేరున గురువారం రూ. 55 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ దాతలకు ప్రసాదం అందించారు.